క్లుప్తంగా

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



ప్రదర్శనతో విద్యార్థులు

ఐ.పోలవరం: పీఎంశ్రీ పాఠశాలగా ఎంపికైన ఐ.పోలవరం జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం వరల్డ్ యూత్ స్కిల్ డే సందర్భంగా విద్యార్థులు పలు ప్రదర్శనలు నిర్వహించారు. అగ్రికల్చర్, ఆటోమొబైల్, బ్యాంకింగ్, ఫైనాన్స్, క్రాఫ్ట్ కోర్సులకు సంబంధించి పలు ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం వీధి సురేష్‌బాబు మాట్లాడుతూ విద్యార్థులకు పెంపొందించుకోవాల్సిన నైపుణ్యం, సామర్థ్యాలకు ఈ ప్రదర్శన ఉపయోగపడుతుందన్నారు. అగ్రికల్చరల్ ఒకేషనల్ టీచర్ జి.రమ్య, ఆటోమోటివ్ ఒకేషనల్ కె.సతీష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె

ముమ్మిడివరం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరుతూ నగర పంచాయతీలో పనిచేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె బుధవారం నాల్గవ రోజుకు చేరుకుంది. గత సమ్మెకాలపు ఒప్పందాల ప్రకారం జీఓ 36 అనుసరించి జీతాలు పెంచాలని వారు డిమాండ్ చేశారు. అధికారులతో ఇప్పటివరకు రెండు దఫాలు చర్చించినప్పటికీ న్యాయం జరగలేదని, ప్రభుత్వం స్పందించకపోవడంతో సమ్మెకు దిగామన్నారు. దీక్షా శిబిరాన్ని పలువురు నాయకులు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ సమ్మెలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అజయ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, జి.రమేష్, వై.రమణ, జి.వెంకటేశ్వరరావు, కే.శ్రీనివాసరావు, వి.ప్రసాద్ కే.శివ పాల్గొన్నారు.

సరోజ, కోటకు ఘన నివాళులు

తాళ్లరేవు: తెలుగు చిత్రసీమలో ధ్రువతారలుగా వెలిగి ఇటీవల మృతి చెందిన అలనాటి నటి బి.సరోజ, విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావుకు బుధవారం ఘన నివాళులు అర్పించారు. స్థానిక ప్రజా సంఘాల భవనంలో ఎన్టీఆర్, ఏఎన్ఆర్, సావిత్రి కళాభిమాన సంఘం కన్వీనర్ ఉంగరాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సరోజ, కోట చిత్రపటాలకు నాయకులు పూలమాలలు వేసి సినీ రంగానికి వారు చేసిన సేవలను స్మరిస్తూ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సలాది సత్తిబాబు, కామిశెట్టి వేణుగోపాల్, ఎలిపే నాగేశ్వరరావు, అత్తిలి బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

దేవగుప్తం సొసైటీ అధ్యక్షుడిగా వేగిరాజు

అల్లవరం: దేవగుప్తం పీఏసీఎస్ అధ్యక్షుడిగా గుండెపూడికి చెందిన వేగిరాజు వెంకటరావు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. పాలకవర్గ సభ్యులు దేవగుప్తం గ్రామానికి చెందిన చిట్టూరి శ్రీనివాస్, డి.రావులపాలెంకు చెందిన నల్లా నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. ప్రమాణ స్వీకారం సందర్భంగా సొసైటీ ఆవరణంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర రైతు విభాగ ప్రధాన కార్యదర్శి, మాజీ సొసైటీ అధ్యక్షుడు జున్నూరి రామారావు, ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ సాధనాల వెంకటరావు, తిక్కాప్రసాదు, టీడీపీ నాయకులు సత్తిబాబురాజు, పోతుల నాగరాజు, గుబ్బల నాగేశ్వరరావు, చిట్టూరి శ్రీను, సురేష్ డాక్టర్, తదితరులు పాలక వర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాజీ సొసైటీ అధ్యక్షుడు రామారావుకు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి

యానాం: విద్యార్థులు తమ భవిష్యత్తును ఉన్నతంగా తీర్చుదిద్దుకునేందుకు చదువుపై దృష్టి సారించాలని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జవహర్ నవోదయ విద్యాలయలో విద్యాలయ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నవోదయకు వస్తున్న నిధులు, వాటి ఖర్చులు, కావాల్సిన సౌకర్యాలు తదితరమైన వాటిపై సమీక్షించారు. స్థానిక ఎస్ఆర్‌కే డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కరరెడ్డి, జీజీహెచ్ డీడీ రవిశంకర్, ప్రిన్సిపాల్ కీర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ

తాళ్లరేవు: ఎన్నికల విధి, విధానాలు, నియమ నిబంధనలపై బూత్‌స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో చీఫ్ ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు 40 మంది బూత్‌స్థాయి అధికారులకు మాస్టర్ ట్రైనర్ కె.బాలాజీ శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలు మండలాల రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఎయిడెడ్ స్కూల్ టీచర్లకు వేతనాలు చెల్లించాలి

యానాం: యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్ల పరిధిలోని 35 ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్ టీచర్లకు నాలుగు నెలలుగా చెల్లించాల్సిన వేతన బకాయిలు తక్షణం చెల్లించాలని బుధవారం పుదుచ్చేరి అసెంబ్లీ మూల్యాంకన కమిటీ చైర్మన్ నజీమ్ ప్రభుత్వాన్ని ఆదేశించారు.స్పీకర్ చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ ఎయిడెడ్ స్కూల్స్ టీచర్లకు, సిబ్బందికి వేతనాలు అందకపోవడంపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశానికి కమిటీ సభ్యులు ప్రభుత్వ విప్ ఏకేటీ అర్ముగం, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ కార్యదర్శి దయాలన్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

చేలకు అందని సాగు నీరు..!

- అధికారుల నిర్లక్ష్యం
- పూర్తిస్థాయిలో అందని సాగునీరు
- పలుచోట్ల ఎండిపోతున్న ఆకుమడులు
- ఊతమివ్వని వర్షాలు
- ఆందోళనలో రైతన్నలు



పోలేకుర్రులో పంటచేనుకు గుల్లతో నీరు తోడుకుంటున్న రైతు



పి.మల్లవరం పంట కాలువలో అరకొరగా నీటి ప్రవాహం

తాళ్లరేవు: రైతన్నలకు ఆదిలోనే సాగునీటి కష్టాలు తప్పడం లేదు. గోదావరిలో నీరు పుష్కలంగా ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పంట కాలువలకు మాత్రం నీరు పూర్తిస్థాయిలో అందని పరిస్థితి. పంట ప్రారంభం కాకముందే సాగునీరు పూర్తిస్థాయిలో అందక రైతన్నలు అష్టకష్టాలు పడుతున్నారు. పంట కాలువలకు నీటిని విడుదల చేసి నెలరోజులు కావస్తున్నా వరి చేలకు పూర్తిస్థాయిలో నీరు అందని పరిస్థితి నెలకొంది. కనీసం వరుణుడైనా కరుణిస్తాడనుకుంటే పట్టుమని దుక్కు వర్షం కురిసిన దాఖలాల్లేవని రైతులు ఆవేదన చెందుతున్నారు. సాగునీటి కొరత రైతులకు తలనొప్పిగా తయారైంది. అధికారుల నిర్లక్ష్యం, సాగునీటి సరఫరాలో అవగాహనా రాహిత్యం రైతులకు శాపంగా మారుతోంది. నీటిని పూర్తిస్థాయిలో అందిస్తామని భరోసా ఇచ్చే నాథుడే లేకుండా పోవడంతో అన్నదాతలకు భరోసా కరువైంది.

కరుణించని వరుణుడు

ఈ ఏడాది వర్షపాతం బావుంటుందని అధికారులు ప్రకటించినప్పటికీ మృగశిర కార్తె ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టుమని దుక్కు వర్షం కురవలేదని రైతులు వాపోతున్నారు. నైరుతి రుతుపవనాలు సైతం అలా మొహం చూపించి వెళ్లిపోయాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెదురు మదురు చినుకులు తప్ప ఆశించిన స్థాయిలో వర్షం కురవలేదని రైతులు చెపుతున్నారు. పంట సాగుకు ఇప్పటి వరకూ కురిసిన వర్షం ఏ మాత్రం సరిపోవడంలేదని, అందువల్ల వ్యవసాయ పనులు మందకొడిగా సాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఖరీఫ్ పంటకు తీవ్ర ఆలస్యం అవుతోందంటున్నారు.

పంట కాలువల్లో పూడికలు

మండలంలోని పలు ప్రధాన పంట కాలువలతోపాటు, ఇంజరం వంతెన వద్ద ఉన్న కల్వర్టు వద్ద భారీగా చెత్త పేరుకుపోయింది. కాలువల్లోని పూడికలను ఎప్పటికప్పుడు తొలగించకపోవడంతో శివారు పొలాలకు సాగునీరు సక్రమంగా సరఫరా కావడం లేదు. పంట ప్రారంభంలోనే రైతులు గుల్లలు, డీజిల్ ఇంజిన్ల సాయంతో నీరు తోడుకోవాల్సిన పరిస్థితి నెలకొనడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు తూతూ మంత్రంగానే పనులు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు.

సమన్వయంతో పనిచేయాలి

ఆకుమడుల సమయంలో సాగునీరు అందని పరిస్థితి గతంలో ఎప్పుడూ లేదు. అధికారులు, నీటి సంఘాల ప్రతినిధుల సమన్వయ లోపంతోనే ఈ పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా ధవళేశ్వరం బ్యారేజి దగ్గర ఇసుక మేటలను తొలగించి, నీటి నిల్వ సామర్థ్యం పెంచడం, ఇంజరం వంతెన వద్దగల కల్వర్టు వద్ద చెత్త చెదారాలను ఎప్పటికప్పుడు పూడికలు తొలగించడం తదితర పనులను సమన్వయంతో చేయాలని రైతులు కోరుతున్నారు. మండలంలో సాగునీటి సమస్యకు చమురు సంస్థల నిర్వాకం కూడా ఒక కారణమని రైతులు అంటున్నారు. రిలయన్స్, ఓఎన్‌జీసీ వంటి చమురు సంస్థలు పంట కాలువల నుంచి సాగునీటిని యథేచ్ఛగా తోడేయడంతో పంట చేలకు నీరు అందడం లేదని వారన్నారు. ముఖ్యంగా పి.మల్లవరం- నీలపల్లి కాలువలో నీటిని నియంత్రించే డివైండింగ్ డ్యామ్ గేట్లు లేకపోవడంతో సాగునీరు వృథాగా పోతోందని రైతులు అంటున్నారు. దీనివల్ల చాలా ప్రాంతాల్లోని పొలాలకు నీరు అందడం లేదని, కనీసం వరినాట్లు వేసుకునే సమయానికి పూర్తిస్థాయిలో సాగునీటిని అందించాలని వారు కోరుతున్నారు.

సేవలకు సత్కారం



శివరామ్‌ను సత్కరించిన రైతులు

అల్లవరం: దేవగుప్తం సచివాలయ పరిధిలోని రైతు సేవా కేంద్రంలో ఉద్యాన సహాయకుడిగా బాధ్యతలు నిర్వర్తిస్తూ కొమరగిరిపట్నం సచివాలయానికి బదిలీపై వెళ్లిన వంగా శివరామ్‌ను ఆ గ్రామానికి చెందిన రైతులు సొసైటీ ఆవరణలో బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, ఉద్యాన సహాయకుడి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రైతులు కుడుపూడి అప్పారావు, చిట్టూరి వెంకటనారాయణ, బొంతు రాంబాబు, కుడుపూడి కిరణ్, మిద్దే సూర్యనారాయణ, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

సోలార్ ప్యానళ్లతో ఇంట్లోనే విద్యుత్ ఉత్పత్తి

అమలాపురం టౌన్: పీఎం సూర్య ఘర్ యోజనలో మన ఇంటిపై ఏర్పాటు చేసుకునే సోలార్ రూఫ్ టాప్‌లతో మనమే విద్యుత్ ఉత్పత్తి చేసే వెసులబాటు ఉంటుందని టిడ్కో ఇళ్ల సముదాయం పర్యవేక్షణాధికారిణి డి.లలితకుమారి అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం కౌన్సిల్ హాలులో పీఎం సూర్య ఘర్ యోజనకు కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీలపై అధికారులు రెండో రోజు బుధవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రణాళికా విభాగం అధికారిణి బి.రాణి సంయుక్త, పీఎం సూర్య ఘర్ యోజన అధీకృత ఏజెంట్ యల్లమిల్లి నాగసుధా కొండ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సిబ్బంది, డ్వాక్రా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. పథకానికి సంబంధించిన రాయితీల వివరాలతో కూడిన కరపత్రాలను ప్రదర్శించి అవగాహన కల్పించారు. పట్టణంలోని గృహస్తులు ఈ పథకాన్ని, రాయితీని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించాలని వారు సూచించారు.

ఐఐటీ విజేతలకు ఘన సత్కారం



16 మంది ఐఐటీ కాపు విజేతలతో కాట్వా రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

అమలాపురం టౌన్: ప్రతిష్టాత్మక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ)ల్లో తమ విద్యా ప్రతిభతో అడుగు పెట్టిన కోనసీమకు చెందిన 16 మంది విద్యార్థులను కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (కాట్వా) అమలాపురంలో బుధవారం ఘనంగా సత్కరించి అభినందించింది. స్థానిక కల్వకొలను వీధిలో కాట్వా జిల్లా అధ్యక్షుడు మేడిచర్ల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి కాపు జేఏసీ నాయకుడు కల్వకొలను తాతాజీ ముఖ్య అతిథిగా పాల్గొని ఐఐటీ విజేతలను సత్కరించారు. జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో దేశ స్థాయిలో 82వ ర్యాంక్ సాధించిన గొలకోటి వారిపాలెంనకు చెందిన తోరాటి భరద్వాజ్‌ను విద్యార్థులు స్ఫూర్తిగా తీసుకోవాలని తాతాజీ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా 16 మంది ఐఐటీ విజేతలను జ్ఞాపికలు అందజేయగా టాప్ ర్యాంకర్ భరద్వాజ్‌కు ఏపీ కాట్వా గౌరవాధ్యక్షుడు, ఆలీవ్ స్వీట్స్ అధినేత దొరరాజు అందించిన లాప్ ట్యాప్‌ను బహూకరించారు. కార్యక్రమంలో కాట్వా జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, పారిశ్రామికవేత్త బండిగుప్తాపు పాండురంగ, కాట్వా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైనర్‌బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి నందెపు శ్రీనివాస్, ఎస్వీ నాయుడు, కేకేవీ నాయుడు, నాగిరెడ్డి శివ ప్రసాద్ పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి ఆలయంలో విశేష పూజలు

తాళ్లరేవు: సుంకరపాలెంలో అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం విశేష పూజలు చేసారు. స్వామివారి ఆలయం ప్రతిష్ఠ నిర్వహించి 40 రోజులు పూర్తయిన సందర్భంగా పెనికేరు వాస్తవ్యులు, తిరుమల తిరుపతి దేవస్థానం పండితులు కాళ్లకూరి దుర్గా ప్రసాద్ శర్మ బృందం పర్యవేక్షణలో ఆలయ స్థపతి పెద్దిరెడ్డి సతీష్ ఆదేశాల మేరకు స్వామివారికి గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్య ఆరాధన, యంత్ర శ్రీకరణ, త్రిశూల పూజ, వాస్తుపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన ప్రత్యేకమైన 11 రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, 11 రకాల తాంబూలాలు, మంత్ర పుష్పాలతో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. అనంతరం నవగ్రహ హోమాలు, అష్టాదశ హోమాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన మోపూరి వెంకటరెడ్డి నాయుడు శేషామణి దంపతులతోపాటు మరో 25 జంటలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, కాపులపాలెం, కనకాలపేట గ్రామ పరిసర ప్రాంత భక్తులు హాజరయ్యారు.

వ్యభిచార ముఠా అరెస్ట్

తాళ్లరేవు: మండల పరిధిలోని నీలపల్లి కొత్త కాలనీలో బుధవారం రాత్రి వ్యభిచార ముఠాను అరెస్ట్ చేసినట్లు కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపారు. స్థానిక కాలనీలోని ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు కాకినాడ రూరల్ సీఐ చైతన్య కృష్ణ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఒక మహిళ, ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి వారిని కోర్టులో హాజరుపర్చనున్నట్టు సీఐ తెలిపారు.

కేసుల పరిష్కారంపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ

ముమ్మిడివరం: మధ్యవర్తిత్వం ద్వారా త్వరితగతిన కేసులు పరిష్కరించుకొని మానవ సంబంధాలు మెరుగుపర్చుకోవాలని మండల లీగల్‌సెల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పిలుపు నిచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు బుధవారం ముమ్మిడివరంలో కేసుల పరిష్కారంపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. కోర్టు ప్రాంగణం నుంచి ప్రధాన రహదారి వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కేసుల పరిష్కారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ ర్యాలీలో సీఐ ఎం.మోహన్‌కుమార్, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన ఎస్సైలు డి.జ్వాలాసాగర్, ఎంపీపీ రవీంద్రబాబు, అవినాష్, బార్ అసోషియేషన్ అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు, ఏజీపీ కాశి సిద్ధార్థ కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో విద్యార్థులను చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి డోలా బాల ఆంజనేయ స్వామి

అమలాపురం రూరల్: అధికారులు, ఉపాధ్యాయులు సర్వే నిర్వహించి విద్యార్థులను వసతి గృహాల్లో చేర్పించాలని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లాలో సంక్షేమ వసతి గృహ పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, టీచర్ల బోధనా తీరు, చిన్నారుల విద్యా ప్రగతి అంశాలపై అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ గంటి హరీష్ మాధుర్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, డీఆర్ఓ రాజకుమారి, సాంఘిక సంక్షేమ సాధికారత అధికారిని పి.జ్యోతిలక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక నిధులను వినియోగించాలి

యానాం: ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమం కోసం కేటాయించిన ప్రత్యేక నిధులను ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా వినియోగించాలని ఎల్జీ కైలాషనాథన్ అధికారులను ఆదేశించారు. బుధవారం రాజ్‌నివాస్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో జాతీయ ఎస్సీ కమీషన్ కార్యదర్శి గుడే శ్రీనివాస్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శరత్‌చౌహాన్, వివిధ శాఖల కార్యదర్శులు పాల్గొన్నారు.

మున్సిపల్ లైబ్రరీలో సిబ్బందిని నియమించాలి



మున్సిపల్ లైబ్రరీ వద్ద నిరసన తెలుపుతున్న పాఠకులు

అమలాపురం టౌన్: అమలాపురంలోని మున్సిపల్ పిల్లల పార్కు వద్ద గల లైబ్రరీలో సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేస్తూ అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో పాఠకులు బుధవారం నిరసన తెలిపారు. అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు చీకురుమిల్లి కిరణ్‌కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పర్యవేక్షణలో పనిచేసే ఈ లైబ్రరీని పట్టించుకునే నాథుడే కరవయ్యాడని తెలిపారు. పాఠకులే ఉదయం లైబ్రరీ తలుపులు తెరిచి పేపర్లు చదువుకుని వారే తాళాలు వేసి వెళుతున్నారని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ ఈ సమస్యపై చొరవ తీసుకుని లైబ్రరీకి సిబ్బందిని నియమించాలని వారు విజ్ఞప్తి చేశారు. అంబేడ్కర్ సేవా సమితి ఉపాధ్యక్షుడు సంసాని రత్నకుమార్, పాఠకులు నూలు సుబ్రహ్మణ్యం, శ్రీనివాస్, సత్యానందం తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో ఏఐ పాత్ర కీలకం

అమలాపురం టౌన్: నేడు అన్ని రంగాల్లో అంటే వైద్య, విద్య, రవాణా తదితర రంగాల్లో కృత్రిమ మేధ (ఏఐ) కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకుంటోందని అమలాపురం పట్టణానికి చెందిన పలువురి విద్యావేత్తలు అభిప్రాయపడ్డారు. జాతీయ కృత్రిమ మేధ ప్రశంసా దినోత్సవం సందర్భంగా వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ స్ట్రీట్‌లో బుధవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పలువురు విద్యావేత్తలు ఏఐ ప్రాధాన్యతను వివరించారు. వాకర్స్ ప్రతినిధులు, విదావేత్తలు ప్రొఫెసర్ గోకరకొండ నాగేంద్ర, పేరి లక్ష్మీ నరసింహం, పుత్సా కృష్ణ కామేశ్వర్ తదితరులు మాట్లాడుతూ కృత్రిమ మేధ అంటే ఏమిటి? అది మానవ జీవితాన్ని ఏ విధంగా ప్రభావితం చేస్తుంది. సామాజిక, ఆర్థిక రంగాల్లో దాని ప్రాధాన్యత వంటి అంశాలపై వారు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కృత్రిమ మేధపై కొన్ని అపోహలున్నా భవిష్యత్తును మార్చే శక్తిగా మారబోతోందన్న వాస్తవాన్ని వారు వివరించారు. వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్యవరప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమంలో వాకర్స్ గవర్నర్ సప్పా నాగేశ్వరరావు, తేతల సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

అంతర్జాతీయ న్యాయదినోత్సవం
International Law Day

న్యాయ సేవలో జడ్జిలు, న్యాయవాదుల పాత్ర కీలకం

అమలాపురం టౌన్: అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని గురువారం నిర్వహించేందుకు న్యాయవాదులు ఏర్పాట్లు చేస్తున్నారు. న్యాయ సేవలో న్యాయమూర్తులతో పాటు న్యాయవాదుల పాత్ర కూడా కీలకం. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని అంతర్జాతీయ క్రిమినల్ జస్టిస్ దినోత్సవం అని కూడా అంటారు. అందుకే ఈ దినోత్సవాన్ని క్రిమినల్ జస్టిస్ వ్యవస్థకు గుర్తింపుగా జరుపుకుంటారు. ఒక్క అమాయకుడికి కూడా అన్యాయం జరగకూడదన్న సూత్రం నాటి నుంచి నేటి వరకూ న్యాయ వ్యవస్థకు పునాది అయింది. ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్ట్ సృష్టికి కారణమైన ఒడంబడిక 'రోమ్ స్టాట్యూ' వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఏటా జూలై 17న ఇంటర్నేషనల్ జస్టిస్ డే నిర్వహించేందుకు నిర్ణయించారు. ప్రపంచవ్యాప్తంగా జూలై 17న న్యాయ వ్యవస్థకు అత్యంత గౌరవం ఇస్తూ క్రిమినల్ జస్టిస్‌ను ప్రోత్సహిస్తూ ఇంటర్నేషనల్ క్రిమినల్ కోర్టుకు మద్దతుగా అనేక కార్యక్రమాలు చేపట్టడం ఆనవాయితీగా వస్తోంది. అంతర్జాతీయ న్యాయ దినోత్సవాన్ని జిల్లాలోని పలు కోర్టులకు చెందిన న్యాయవాదులు జరుపుకోనున్నారు. ముఖ్యంగా జిల్లా కేంద్రం అమలాపురంలో ఒకరినొకరు న్యాయవాదులు శుభాకాంక్షలు తెలుపుకోనున్నారు. జిల్లాలోని ఆయా కోర్టుల, ప్రాంతాల పరిధిలో ఉన్న బార్ అసోసియేషన్లకు చెందిన న్యాయవాదులు ఈ దినోత్సవంతో పాలు పంచుకోనున్నారు.

రాజీ అంటే ఇద్దరి గెలుపు



అమలాపురంలో పోలీసులు న్యాయవాదుల బైక్ ర్యాలీ

అమలాపురం టౌన్: మధ్యవర్తిత్వం ద్వారా కేసుల పరిష్కారమైనప్పుడు అది రాజీ అవుతుందని, ఈ మార్గంలో ఇద్దరు కక్షిదారులు గెలిచినట్లేనని అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతపల్లి అజయ్‌కుమార్ అన్నారు. మధ్యవర్తిత్వం కేసులను ప్రోత్సహించే దిశగా ప్రజలకు అవగాహన కోసం స్థానిక కోర్టుల ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బైక్ ర్యాలీలో అజయ్‌కుమార్ మాట్లాడారు. అమలాపురం రెండో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి పి.గోవర్ధన్ ఆదేశాలతో ఈ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. బార్ అసోసియేషన్ కోశాధికారి నందెపు శ్రీవెంకటేశ్వరవు, అసోసియేషన్ ప్రతినిధులైన న్యాయవాదులు దొమ్మేటి వెంకటేశ్వరావు, యాలంగి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.